సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 19 । జూన్ । 2024



పౌష్టికాహారంతో ఆరోగ్యం


వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. - 8లో



వైభవోపేతం.. వేద సదస్యం

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం ఆలయంలో వేద పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. - 8లో

డెల్టాలకు 7,845 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 7,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.95 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ సెకండియర్ ఫలితాల విడుదల

జనరల్‌లో 44 శాతం, ఒకేషనల్‌లో 46 శాతం ఉత్తీర్ణత

రాయవరం: ఇంటర్మీడియెట్ **రెండవ సంవత్సరం** అడ్వాన్స్‌డ్ సప్లిమెంట**రీ పరీక్షా ఫలి**తాలు మంగళవారం విడుదల**య్యాయి. ఇంట**ర్మీడియెట్ బోర్డు రాష్ట్ర **అధికారులు** మధ్యాహ్నం రెండు గంటల తర్వాత విడుదల చేశారు. గత నెల 24 నుంచి 31వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. పరీక్షల ఫలితాలు విడుదల చేయగా, ఇంటర్ సెకండియర్ జనరల్ నుంచి 3,194 మంది పరీక్షకు హాజరు కాగా, 1,395 మంది(44శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ పరీక్షలకు జిల్లా నుంచి 710 మంది పరీక్షలు రాయగా, 326(46 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్ స్క్రీన్ వాల్యుయేషన్ జరిగింది. గతంలో ఫిజికల్‌గా వాల్యుయేషన్ జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో చేపట్టగా, తొలిసారిగా ఆన్‌లైన్ స్క్రీన్ వాల్యుయేషన్ చేపట్టి ఫలితాలను విడుదల చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాలను ఈ నెల 26న విడుదల చేసే అవకాశముంది.

మధ్యవర్తిత్వంతో కేసులకు సామరస్య పరిష్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మధ్యవర్తిత్వం ద్వారా ఖర్చులు లేకుండా సామరస్యపూర్వకంగా కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న మధ్యవర్తిత్వ శిక్షణ స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంపై ఈ నెల 22వ తేదీ వరకూ 40 గంటల పాటు శిక్షణ జరుగుతుందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం జరుగుతుందని చెప్పారు. బెంగళూరుకు చెందిన పొటెన్షియల్ ట్రైనర్ గీతాదేవి, బి.శ్రీకుమార్, చైన్నైకి చెందిన ఆర్.విజయకమల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ..గాయత్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

సత్యదేవుని చిన్న రథానికి షెడ్డు



చిన్న రథానికి నిర్మించిన షెడ్డు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని చిన్న రథానికి ఎట్టకేలకు షెడ్డు నిర్మించారు. పశ్చిమ రాజగోపురం పక్కన భక్తులందరూ తిలకించేందుకు వీలుగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ షెడ్డు పనులు మంగళవారం పూర్తవడంతో త్వరలోనే రథాన్ని ఇక్కడకు తరలించనున్నారు. రత్నగిరిపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగించేందుకు సుమారు రూ.34 లక్షల వ్యయంతో చిన్న టేకు రథం తయారు చేయించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 16న తొలిసారిగా ఈ రథంపై స్వామి, అమ్మవారిని ఊరేగించారు. ఆ తరువాత ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ఈ రథంపై ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తున్నారు. ఊరేగింపు అనంతరం ఆలయ ప్రాకారంలో సన్‌డయల్ వద్ద ఈ రథాన్ని నిలిపి, దానిపై కవర్ కప్పుతున్నారు. అయితే, ఈ రథం రక్షణకు షెడ్డు నిర్మించాలన్న డిమాండ్ భక్తుల నుంచి రావడంతో ఈఓ. కె.రామచంద్ర మోహన్ వెంటనే స్పందించి, షెడ్డు నిర్మాణానికి ఆదేశాలిచ్చారు.

20 నుంచి ఐటీఐ అడ్మిషన్ల కౌన్సెలింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ స్థానిక ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 20వ తేదీన మెరిట్ నంబర్ 1 నుంచి 286 వరకూ, 21న 287 నుంచి 561 వరకూ, 22న 562 నుంచి 838 వరకూ, 23న 839 నుంచి 1,115 వరకూ అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఆయా తేదీల్లో ఎవరైనా హాజరు కాలేకపోతే 24, 25 తేదీల్లో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో సంరక్షకులను తీసుకుని కౌన్సెలింగ్‌కు రావాలని పేర్కొన్నారు.

రాచపుండు.. తీద్దాం బెండు



వైద్య రంగాన్నే గడగడలాడించే క్యాన్సర్ పేరు వింటేనే మనిషి సగం చచ్చిపోతాడు. అటువంటి వ్యాధి సోకిందని తెలిస్తే.. అతడి మానసిక పరిస్థితిని ఊహించడం కష్టమే. ఒకానొక సమయంలో క్యాన్సర్‌కు చికిత్స లేదనే దుస్థితి నుంచి.. వైద్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ఇప్పుడు క్యాన్సర్‌పై పోరాటం చేసే స్థాయిని వైద్య నిపుణులు అందిపుచ్చుకున్నారు. దీనిని మరింత విస్తృత పరుస్తూ.. చిగురించక మునుపే క్యాన్సర్ ముప్పును తుంచేయాలన్న బృహత్తర ప్రణాళికకు ప్రాణం పోసేందుకు వైద్య, ఆరోగ్య యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

- మహమ్మారి క్యాన్సర్‌కు చెక్ పెట్టేందుకు కీలక అడుగులు
- క్షేత్ర స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు
- నిష్ణాతులైన ప్రత్యేక బృందాలతో జిల్లాల వారీగా శిక్షణ
- గత ప్రభుత్వ హయాంలోనే అంకురార్పణ



శిక్షణలో భాగంగా కీమో థెరపీ ప్రక్రియను వివరిస్తున్న అంకాలజీ నిపుణుడు డాక్టర్ నరసింహులు



క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణకు హాజరైన బృందంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ తదితరులు

కాకినాడ క్రైం: క్యాన్సర్ విషాదాంతాలకు చరమగీతం పాడే బృహత్కార్యం ఆవిష్కృతం కానుంది. తొలి దశలోనే ఈ మహమ్మారిని అంతం చేయడం, అసలు సోకకుండా జాగ్రత్తలు వహించడం ద్వారా ఇది సాధ్యం కానుంది. ఇందుకు ప్రజల్లో అవగాహన సామర్థ్యాన్ని పెంచి, ఆ దిశగా అడుగులు వేయించేందుకు కార్యాచరణ రూపుదిద్దుకుంటోంది. మండలాల వారీగా ప్రత్యేక శిక్షణ పొందే యంత్రాంగం స్క్రీనింగ్, ప్రివెన్షన్ అనే అంశాలపై కసరత్తు ప్రారంభించనుంది. జిల్లాలో ఇప్పటికే ఈ శిక్షణలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం అంకురార్పణ చేసిన ఈ మహత్కార్య నిర్వహణకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య విభాగం జిల్లాలకు తగిన మార్గనిర్దేశాలిచ్చింది.

దశల వారీ ప్రణాళిక

క్యాన్సర్ సోకకుండా ఉండేందుకు శాస్త్రీయ రీతిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బందిని తీర్చిదిద్దడమే ఈ శిక్షణ లక్ష్యం. దశల వారీగా ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రధాన శిక్షణ కార్యక్రమానికి జిల్లా తరపున కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహులు ప్రాతినిధ్యం వహించారు. అక్కడ శిక్షణ పొందిన ఆయన.. తన బృందంతో కలిసి జిల్లాలో వివిధ ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులకు, స్పెషలిస్టులకు, వైద్య, ఆరోగ్య సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. దీనికి దశల వారీ శిక్షణ ప్రణాళిక అనుసరిస్తున్నారు. ఆంకాలజీ విభాగాధిపతి (హెచ్‌ఓడీ), జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసన్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుండగా, ఎస్‌పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ నరసింహం ఆదేశాలతో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ మొత్త ప్రక్రియకు రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

శిక్షణ ఎవరికంటే..

వైద్యాధికారులు, స్పెషలిస్టులతో పాటు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. ప్రతి విడతలో కనీసం మూడు రోజులు జరుగుతున్న ఈ శిక్షణకు నిష్ణాతులైన వివిధ స్పెషాలిటీలకు చెందిన టీం సభ్యులు శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. జీజీహెచ్‌తో పాటు జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. తొమ్మిది మంది శిక్షకులతో కూడిన ఈ బృందంలో ఇద్దరు ఆంకాలజీ నిపుణులు కూడా ఉన్నారు. శిక్షణ పొందుతున్న వారిలో గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, సర్జరీ స్పెషలిస్టులు ఉన్నారు.

ఇదీ లక్ష్యం

శిక్షణ పొందిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఆయా ప్రయోజనాలను బదిలీ చేసే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఇప్పటికే తగిన మార్గదర్శకాలు వెలువడ్డాయి. వీరు మండలాలు, గ్రామాల స్థాయిలో వైద్య, ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. ఈ శిబిరాల్లో హైరిస్క్ వర్గాలకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మహిళలు, తరచుగా గర్భాశయ ముఖద్వార ఇన్ఫెక్షన్‌కు గురయ్యేవారు, అప్పటికే కుటుంబ సభ్యుల్లో క్యాన్సర్ ఉన్నవారు, జీవనశైలి, ఆహార నియమాల్లో క్రమబద్ధత లేని వారు, గుట్కా, పాన్, పొగాకు, మద్యం అలవాటు ఉన్నవారు ఈ కేటగిరీ కిందకు వస్తారు. వీరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవగాహన కల్పించడం, క్యాన్సర్ సోకిన దాఖలాలుంటే తగిన వైద్య సేవలందించడం ఈ బృందం లక్ష్యం.

వచ్చే నెల నుంచి స్క్రీనింగ్ క్యాంపులు

క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపునకు సెల్ఫ్ చెక్‌పై మహిళలకు అవగాహన కల్పించనున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో వీటి నిర్వహణ ప్రత్యేక నోడల్ అధికారి సమక్షంలో జరగనుంది.

గత ప్రభుత్వ హయాంలో..

నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేసింది మాత్రం గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే. ఇందులో భాగంగానే మహిళా దినోత్సవం రోజున వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. నాటి తొలి దశ పరీక్షలు ఎన్నో ప్రాణాలను నిలిపాయి. ఒక్క కాకినాడ జీజీహెచ్‌లోనే ముగ్గురు నర్సులు తాము క్యాన్సర్ బారిన పడిన విషయాన్ని గుర్తించి తొలి దశలో చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకున్నారు. చక్కటి ప్రయోజనాలు అందడంతో కార్యక్రమ విస్తృతిని పెంచాలని నిర్ణయించింది.

పెరుగుతున్న కేసులు

అధునాతన వైద్య సదుపాయాలు, అంతం చేసే మందులు, పెరుగుతున్న అవగాహన వీటన్నింటికీ తోసిరాజని క్యాన్సర్ కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతూండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఆహార కల్తీ, కాలుష్యం, క్యాన్సర్ ప్రేరేపిత మందుల వినియోగం, మాదక ద్రవ్యాలు, పొగాకు, గుట్కాల అలవాటు, వారసత్వంతో పాటు, పలు అంశాలు క్యాన్సర్ వ్యాప్తికి దోహదం చేస్తున్నాయని జీజీహెచ్ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ కె.ప్రదీప్ అన్నారు. ఈ ఏడాది గడచిన ఐదున్నర నెలల్లో కాకినాడ జీజీహెచ్‌లో నమోదైన క్యాన్సర్ కేసుల గణాంకాలను పరిశీలిస్తే, పెరుగుదలను స్పష్టంగా గుర్తించవచ్చు.

జనవరి	49
ఫిబ్రవరి	54
మార్చి	61
ఏప్రిల్	68
మే	46
జూన్ (14వ తేదీ వరకూ)	29

అవగాహన, వ్యాధి అంతమే లక్ష్యం



క్యాన్సర్‌ను తొలి దశలోనే అంతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేశాం. ఇందుకు శిక్షకులకు విశాఖపట్నంలో జాతీయ స్థాయి నిపుణులతో ప్రత్యేక శిక్షణ నిర్వహించాం. దశలవారీగా నిర్వహిస్తున్న తరగతుల వల్ల సిబ్బంది, వైద్య నిపుణుల్లో క్యాన్సర్, స్క్రీనింగ్‌లపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందుతోంది. స్పెషాలిటీ వైద్యుల నుంచి ఏఎన్ఎంల వరకూ ఎవరి స్థాయిలో వారు క్యాన్సర్‌ను గుర్తించగల తొలి దశ పరీక్షలు నిర్వహించగలగడం ఈ శిక్షణ ప్రత్యేకత. అవగాహనతోనే క్యాన్సర్ అంతం కాగలదన్న వాస్తవంపై విస్తృత ప్రచారం కల్పించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యం.

– డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ)

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి జమ

1,22,279 మంది రైతుల ఖాతాల్లోకి రూ.24.45 కోట్లు



కిసాన్ సమ్మాన్ నిధులు విడుదలను తిలకిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బోస్‌బాబు, అధికారులు

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 17వ విడత ద్వారా అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 1,22,279 మంది రైతులకు రూ.2,000 చొప్పున రూ.24.45 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ చేశారని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎ.బోసుబాబు తెలిపారు. ఈ సొమ్మును ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం సాయంత్రం వారణాసిలో నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారన్నారు. వర్చువల్ విధానంలో రైతు భరోసా కేంద్రం ద్వారా ఆయన ఈ కార్యక్రమం తిలకించారు. బోసుబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన అనేది భారత ప్రభుత్వం ప్రారంభించిన పథకమని, దీని లక్ష్యం రైతుకు కనీస ఆదాయ మద్దతును అందించడమేనని చిన్న, సన్నకారు రైతు లందరికీ సంవత్సరానికి రూ.6,000 ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తుందన్నారు. భూమి ఉన్న రైతుల కుటుంబాలందరికీ మూడు సమాన వాయిదాలలో అందిస్తారన్నారు. మూడు విడతల్లో రూ 2,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. నాలుగు నెలలకు ఒకసారి ఈ సాయాన్ని విడుదల చేస్తుందని. ఈ స్కీమ్‌ను మొట్టమొదటిసారిగా 2019 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారన్నారు. ఈ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా తిలకించిన వారిలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రానైట్ పలకల తొలగింపు

- ఎండలో వీటిపై నడవలేక భక్తులకు ఇబ్బందులు
- తొలగించాలని ఈఓ ఆదేశం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో తూర్పు రాజగోపురానికి ఎదురుగా ఘాట్ రోడ్ వద్ద మెట్లకు వేసిన గ్రానైట్ పలకలను తొలగిస్తున్నారు. ఈ పలకలు ఎండ వేళ బాగా వేడెక్కిపోవడంతో ఈ మెట్ల మీద నడిచేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని స్వయంగా గమనించిన దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఈ గ్రానైట్ పలకలు తొలగించాలని ఆదేశించారు.

నాలుగేళ్ల కిందట మాజీ మంత్రి శిద్దా రాఘవరావు బంధువులు తూర్పు రాజగోపురం నుంచి ఘాట్ రోడ్డు వరకూ ఉన్న సుమారు 70 మెట్లకు ఈ గ్రానైట్ పలకలను విరాళంగా అందచేశారు. వీటిని అతికించడంతో ఆ మెట్లు ఆకర్షణీయంగా కనిపించేవి. అయితే ఈ గ్రానైట్ పలకలు ఎండకు త్వరగా వేడెక్కిపోవడంతో కాళ్లు కాలిపోయి, ఆ మెట్ల మీద నడవడానికి భక్తులు నానా అవస్థలూ పడేవారు. దీంతో ఆ మెట్ల మీద కార్పెట్ వేసేవారు. కొన్ని సమయాల్లో కార్పెట్ వేయకపోతే భక్తుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి.

కమిషనర్ ఆగ్రహం

గత ఏప్రిల్‌లో ఆలయానికి వచ్చిన దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఈ మెట్లపై నడవడానికి భక్తులు ఇబ్బంది పడటం గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మెట్లు మూడు అంచెలుగా ఉంటాయి. తూర్పు రాజగోపురం వద్ద నుంచి ఆలయ ప్రాకారంలోకి, అక్కడ నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకూ, అక్కడి నుంచి ఘాట్ రోడ్డు వరకూ ఉంటాయి. తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న మెట్ల మీద కార్పెట్ ఉంటుంది. ఈ మెట్లపై వీఐపీలకే అనుమతి ఉంటుంది. ఆలయ ప్రాకారం నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకూ ఉన్న మెట్లపై రావిచెట్టు నీడ ఉండటంతో భక్తుల కాళ్లు కాలవు. షాపింగ్ కాంప్లెక్స్ నుంచి ఘాట్ రోడ్డు వరకూ ఉన్న మెట్ల మీద నడిచేటప్పుడే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అందువలన ఈ మెట్ల మీద గ్రానైట్ పలకలను తొలగిస్తున్నారు.



మెట్లపై గ్రానైట్ పలకలను తొలగిస్తున్న కూలీలు

వేడెక్కని పలకలు అతికించే యోచన

ఈ మెట్లపై తొలగిస్తున్న గ్రానైట్ పలకల స్థానంలో త్వరగా వేడెక్కని పలకలు వేయాలని ఈఓ రామచంద్ర మోహన్ యోచిస్తున్నారు. ఇటువంటి పలకలు విరాళంగా ఇచ్చేందుకు గతంలో గ్రానైట్ పలకలు ఇచ్చిన దాత సంసిద్ధత తెలుపుతున్నారు. ఈ మెట్ల మీద త్వరగా వేడెక్కని పలకలు అతికించేందుకు ఏర్పాట్లు చేస్తాం.


– రాంబాబు, డీఈ, అన్నవరం దేవస్థానం

సత్వర చికిత్సతో ప్రాణరక్షణ

- పాముకాట్ల సీజన్‌లో జాగ్రత్తలు పాటించాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఏఎస్‌వీ వ్యాక్సిన్లు
- సంప్రదాయ పద్ధతులపై పూర్తిగా ఆధారపడడం తగదు



పాముకాటు వేసిన పాదం



పాముకాటు ప్రభావాన్ని తెలిపే జీవనాడి



యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వ్యాక్సిన్లు

అలమూరు: వర్షాకాలం వచ్చేసింది. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. పచ్చని పంట పొలాల మధ్య మొక్కలు, చెట్లు, పొదలు, గుంతలు ఏపుగా పెరిగిపోతున్నాయి. దీనివల్ల విష సర్పాల సంచారం పెరిగిపోయి పాముకాట్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. పాముకాటుకు గురైనప్పుడు సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమే అవుతుంది. ఆ సమయంలో సంప్రదాయ చికిత్సలపై ఆధారపడకుండా నేరుగా సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటే ప్రాణాప్రాయం నుంచి తప్పించుకోవచ్చు. విష సర్పాల బారి నుంచి రక్షించేందుకు వీలుగా 1895లో ఫ్రాన్స్‌కు చెందిన ఫిజీషియన్ ఆల్బర్ట్ కాల్మెట్టే యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వ్యాక్సిన్‌ను కనుగొన్నాడు. ఈ ఇంజెక్షన్ దాదాపు అన్ని పాముకాట్ల నుంచి రక్షణనిస్తుంది. భారతదేశంలో పాముకాట్లు ఎక్కువగా సంభవించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉండగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాలుగవ స్థానంలో ఉంది. ఈ జిల్లావ్యాప్తంగా 23 ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రులలోను, 158 పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ పాము కాటు నివారణ (యాంటీ స్నేక్ వీనమ్) వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, చెరువు, కాలువ గట్లు, పొలాల పక్కన సంచరించే కూలీలు ఈ పాముకాట్లకు గురవుతున్నారు. ఏటా జిల్లాలో సుమారు 500 మంది వరకూ పాముకాట్లకు గురవుతుండగా అందులో సకాలంలో చికిత్స తీసుకోని దాదాపు పది శాతం మంది మృత్యువాత పడుతున్నట్టు వైద్యారోగ్యశాఖ చేపట్టిన అధ్యయనంలో తేలింది. సాధారణంగా కోస్తా జిల్లా పరిసరాల్లో అనేక విష సర్ప జాతులు ఉన్నా కేవలం కట్లపాము, రక్త పింజర, తాచు పాము కాట్ల వల్లే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అలాగే పురుషులే ఎక్కువగా పాముకాట్లకు గురవుతున్నారని, అందులో అధిక శాతం మందికి కాలి మీదనే కాట్లు పడుతున్నాయని గుర్తించారు. మానవ శరీరంలోని విష పదార్థాలను తొలగించుకునేందుకు అనునిత్యం వీలైనంత మేరకు ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పాముకాటు లక్షణాలు

- పాముకాటుకు గురైన వ్యక్తులకు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది.
- తీవ్రమైన జ్వరంతో పాటు రక్తపోటు సంభవించి నీరసించిపోతారు.
- పాముకాటు వేసిన చోట తీవ్రమైన భరించలేని నొప్పి వస్తుంది.
- బాధితుడి కనురెప్పలు బలవంతంగా మూతబడతాయి.
- కొద్ది కొద్దిగా ఆ ప్రదేశంలో వాపు వస్తుంది. పాలిపోయిన రంగు సంభవిస్తుంది.
- శరీరంపై రెండు గాట్లు ఉంటేనే విష సర్పం కాటేసినట్టుగా భావించాలి.
- ఆ పాము విషపూరితమైన కోరలు కలిగినదిగా గుర్తించాలి.
- ఒకటి లేదా రెండు కంటే ఎక్కువగా గాట్లు ఉంటే ఆ ప్రదేశం పాముకాటుకు గురికాలేదని నిర్ధారణకు రావాలి.
- పాము కాటు అని అనుమానం వస్తే సమీప అస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.


తీసుకోవలసిన జాగ్రత్తలు

- పాముకాటు బాధితులను సుమారు మూడు గంటల లోపు సమీప ఆస్పత్రులకు తీసుకువెళ్లి చికిత్సను అందిస్తే సురక్షితంగా ప్రాణాలతో బయట పడవచ్చు.
- వ్యవసాయ పనులు చేసేటప్పుడు, అటవీ ప్రాంతంలో సంచరించే సమయంలో రక్షిత పాదరక్షలు తప్పనిసరిగా ధరించాలి.
- పెస్ట్ కంట్రోల్‌ను తరచూ వినియోగించడం ద్వారా పాముల సంచారం గణనీయంగా తగ్గుతుంది.
- పాములు నివసించే ప్రాంతాలను గుర్తించి ఆ మేరకు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పాము జాతి వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పాముకాటుకు గురైన శరీర భాగాన్ని సబ్బు నీటితో కడగాలి.
- పాముకాటు జరిగిన ప్రదేశంలోని అవయవాన్ని కదలకుండా చూడాలి. ఫలితంగా శరీరంలోకి వెళ్లిన విషం త్వరగా విస్తరించే అవకాశం ఉండదు.
- పాముకాటు సంభవించిన ప్రదేశంలో కత్తిరించడం గాని విషాన్ని పీల్చడం కాని చేయకూడదు.
- పాముకాటుకు గురైన వ్యక్తితో నాటు పద్ధతిలో వాంతులు, విరేచనాలు చేయించరాదు.
- పాముకాటుకు గురైనట్టు నిర్ధారణకు వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు ఏఎస్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి.



తాచు పాము

సత్వరమే చికిత్స పొందాలి



వర్షాకాలంలో విష సర్పాలు ఎక్కువగా సంచరించే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైన వ్యక్తులు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా సత్వరమే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి మెరుగైన చికిత్సను తీసుకోవాలి. పీహెచ్‌సీల్లో ఎల్లప్పుడు ఏఎస్‌వీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుతున్నాం.

– డి.సువర్చలదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలం సీజన్ దృష్ట్యా పాముకాట్లకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. వ్యవసాయ రైతులు, కూలీలు విష సర్పాల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలి. పాములు సంచరించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే చక్కని ఫలితం ఉంటుంది.

– పి.ఉమ, హెల్త్ విజిటర్, పెదపళ్ల

క్లుప్తంగా

నా భర్త ఆచూకీ తెలపండి


పెమ్మాడి కాయరాజు

ఐ.పోలవరం: వేటకు వెళ్లి బోటు ప్రమాదంలో గల్లంతైన తన భర్త పెమ్మాడి కాయరాజు ఆచూకీ తెలియజేయాలని పెమ్మాడి సత్యకల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐ.పోలవరం ఇన్‌చార్జి ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 17వ తేదీన భైరవపాలెం రేవు నుంచి ఫైబర్ తెప్పపై సూరాడ ప్రభుదాసు, ఎరిపిల్లి అప్పలరాజు, కర్రి వెంకటేశ్వర్లు, పెమ్మాడి గాలిబాబులతో కలసి పెమ్మాడి కాయరాజు వేటకు వెళ్లాడు. తిరిగి మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటలకు భైరవపాలెం మొగ దగ్గరికి వచ్చేసరికి తెప్పపై కూర్చున్న కాయరాజు అకస్మాత్తుగా పడిపోయాడు. తెప్పపై వెనక్కి వెళ్లి గాలించగా ఆచూకీ లభించలేదు. సముద్రంలో గల్లంతయ్యాడని వేటకు వెళ్లినవారు తెలిపారు.

శస్త్ర చికిత్సకు రూ.1.35 లక్షల సాయం


అయ్యప్పకు రూ.1.35 లక్షల సాయాన్ని అందజేస్తున్న ఆర్య వైశ్య సంఘ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కంచర్ల భైరవమూర్తికి లంగ్స్ మార్పిడి చికిత్స కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి రూ.1.35 లక్షలు సాయంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని రోగి భైరవమూర్తి సోదరుడు అయ్యప్పకు జిల్లా ఆర్య వైశ్య సంఘం నాయకులు తాటిపాకలో అందించారు. ప్రస్తుతం భైరవమూర్తి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో లంగ్స్ మార్పిడి కోసం చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యం కోసం రూ.60 లక్షలు ఖర్చు అవుతున్న క్రమంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు మంత్రి పినిపే విశ్వరూప్ సిఫారసు మేరకు ముఖ్యమంత్రి జగన్ సీఎం సహాయ నిధి నుంచి రూ.20 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ నాయకులు లక్కింశెట్టి బాబులు, నంబూరి సత్యనారాయణమూర్తి, కంచర్ల కృష్ణ మోహన్, పసలపూడి సతీష్, సింగంశెట్టి కుమార్, పచ్చిగోళ్ల సోమరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- సీజనల్ వ్యాధుల కాలంలో జాగ్రత్తలు పాటించకుంటే అనారోగ్యం
- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాల్సిన సమయం
- పోషకాల ఆహారం అవసరం
- వైద్యుల సలహాలు పాటించడం ఉత్తమం
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం


తాజా కూరగాయలు

కాకినాడ సిటీ: వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజు వారీగా పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రత్నకుమార్ వివరించారు.

వీటికి దూరంగా ఉండడం శ్రేయస్కరం

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజువారీ ఆహారం ఇలా..

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో ఉండకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒకవేళ కూరగాయ, పెరుగు వద్దనుకున్నప్పుడు 100 గ్రాముల మాంసాహారం ఉండాలి.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీ మీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు.

పప్పు ధాన్యాలు

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తినాలి.

తాజా కూరలు, పండ్లు

- ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.
- ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం.
- రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయాలు, పండ్లలో ఉండే సూక్ష్మ, పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

జలుబు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడినీరు, పాలు, టీలో ఏదేని ఒకదానిలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారంతో ఆరోగ్యం



ఆహారం బాగా ఉడికించి తినాలి. ఏ, సీ, డీ, కే విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోస సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పని చేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– డాక్టర్ కె.రత్నకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కాకినాడ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కడియం: మండలంలోని పొట్టిలంక వీవర్స్ కాలనీకి చెందిన చెందిన బీరక రాజు (44) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మార్కెట్‌కు వెళ్లేందుకు సిద్ధమైన రాజు ఇంటి నుంచి బయలుదేరి హైవే వద్దకు చేరుకుని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో రావులపాలెం నుంచి వేమగిరి వైపు వేగంగా వస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి రాజు బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజు మోటారు సైకిల్‌తో సహా రోడ్డుపై పడిపోయాడు. తల తదితర శరీర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడి భార్య లక్ష్మివెంకటసంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం ఎస్‌ఐ బి.నాగదుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు పగులగొట్టి చోరీ

జగ్గంపేట: జగ్గంపేటలో తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై సుబ్బారావు తెలిపారు. స్థానిక టవర్ కాలనీలో నివాసం ఉంటున్న గెద్దం వీరలక్ష్మి వారం రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని ఈ నెల 17న బంధువుల నుంచి ఫోన్ రావడంతో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వాటిలో గల సుమారు రెండు కాసుల విలువ గల చెవి దుద్దులు, ఉంగరాలు, కొంత నగదు కనిపించలేదు.

వైభవోపేతం.. వేద సదస్యం

- ఘనంగా బాలాజీ కల్యాణోత్సవాలు
- ఆలయంలో భక్త కోలాహలం


స్వామి వారి సన్నిధిలో జరిగిన సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం భక్తుల కోలాహలంతో ఆలయం సందడిగా మారింది. దేవస్థానం ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారికి సహస్ర నామార్చన, బాలభోగం, చతుస్థానార్చనలు, వేద పారాయణ, హోమాలు, బలిహరణ, మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద గోష్ఠి, సదస్యం (పండిత సన్మానం), వేద పారాయణ, నిత్య హోమం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సదస్యంలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాల్లోని అంతర్వేది, వాడపల్లి, మురముళ్ల, భీమవరం, ద్రాక్షారామం, మందపల్లి తదితర ఆలయాల నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో చతుర్వేద మహదాశీర్వచనంలో భాగంగా లోక కల్యాణార్థం, జగత్ రక్షణ కోసం వేద సదస్యం కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మామిడికుదురుకు చెందిన యింటి శ్రీరామ్‌కుమార్, సుజాత ఆలపించిన శ్రీఅన్నమాచార్య సంకీర్తనలు భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. అప్పనపల్లికి చెందిన శేషశారద భక్త బృందం ఆలపించిన పురంధరదాసు కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ ఆలపించిన అయ్యప్ప గీతాలు భక్తులను అలరించాయి. కార్యనిర్వహణాధికారిణి గ్రంధి మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భార్యను చంపేసిన భర్త

- వివాహేతర సంబంధమే కారణం
- పోర గ్రామంలో దుర్ఘటన

కాట్రేనికోన: వివాహేతర సంబంధానికి ఉన్న అడ్డు తొలగించుకునేందుకు భార్యను హత్య చేసిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామంలో చోటు చేసుకుంది. కాట్రేనికోన ఎస్సై బి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామానికి చెందిన అర్థాని సతీష్‌కు బ్రహ్మసమేత్యం పంచాయతీ బలుసుతిప్ప గ్రామానికి చెందిన సంగాని వీరబాబు ప్రథమ కుమార్తె కుమారి(23)తో ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. మృతురాలి కుమారికి పెళ్లి సమయంలో రూ.3లక్షలు, 3 కాసుల బంగారం, లక్షాయాభైవేల విలువ చేసే గృహోపకరణాలు కట్నంగా ఇచ్చారు. వీరికి నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. సతీష్‌కు ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి కుమారి భర్తను నిలదీయడంతో గొడవలు తలెత్తాయి. అదే గ్రామంలో కుమారి చెల్లెలు ఉండగా ఆమె ఇంటికి సోమవారం బర్త్‌డే ఫంక్షన్‌కు ఇద్దరూ వెళ్లారు. ఫంక్షన్‌కు వెళ్లిన కుమారి.. 'మీ బావ నన్ను చంపివేస్తానని బెదిరిస్తున్నాడు అని చెల్లెలితో చెప్పింది. ఈ విషయం తండ్రి వీరబాబుకు మృతురాలి కుమారి చెల్లెలు చెప్పింది. దీంతో ఈ విషయంపై అల్లుణ్ణి ప్రశ్నించడానికి రెండు రోజులలో పెద్దలను తీసుకుని వస్తానని తండ్రి చెప్పాడు. మంగళవారం వివాహేతర సంబంధంపై భర్త సతీష్‌ను కుమారి నిలదీయడంతో చెంపపై బలంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయింది. స్పృహ తప్పి పడిపోయిన కుమారి కొన ఊపిరితో ఉండగా చీరతో ఫ్యాన్ హుక్‌కు వేలాడదీశానని, అనంతరం తన మరదలు ఇంటికి వెళ్లి మంచి నీరు తాగి వచ్చానని నిందితుడు పోలీసుల విచారణలో చెప్పాడు. మృతురాలి కుమారి తండ్రి సంగాని వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాట్రేనికోన ఎస్సై బి. నాగేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


ఆసుపత్రిలో మృతుడు దుర్గాప్రసాద్

మండపేట: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా వున్నాయి. 20వ వార్డు గొల్లపుంత కాలనీలో సోము రామకృష్ణ, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు. కొడుకులతో సహా తల్లిదండ్రులు ఇద్దరూ కూడా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దాంతోపాటు వీరు పశువులను పోషిస్తూ వుంటారు. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ (19)కు ఏం కష్టం వచ్చిందో ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించాడు. మంగళవారం యథావిధిగా తండ్రి తాపీపనికి, తల్లి దూడలను చక్కదిద్దడానికి వెళ్లారు. పశువుల నుంచి పాలను సేకరించి ఇంటికి తిరిగి వచ్చి చూసుకునే సరికి దుర్గాప్రసాద్ డాబా పైన ఇటీవల నిర్మించుకున్న షెడ్డులో ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు లబోదిబోమంటూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు కూడా అక్కడికి చేరుకున్నారు. వెంటనే తాడుకు వేలాడుతున్న దుర్గా ప్రసాద్‌ను కిందికి దింపారు. బైక్‌పై గుమ్మిలేరు రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మరణించినట్టు ధ్రువీకరించారు. చేతికి అంది వచ్చిన కొడుకు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై సాక్షి టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రికి సమాచారం అందించగా ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని చెప్పారు. కాగా దుర్గాప్రసాద్‌కు ఏ బాధ కలిగి అఘాయిత్యానికి పాల్పడ్డాడు అనే దానిపై ఎవరికీ స్పష్టత లేదు.

అక్కను పెట్రోల్ పోసి హత్య చేసిన తమ్ముడికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: తనతో భార్య విడిపోవడానికి అక్క కారణమన్న అనుమానంతో ఆమెపై పెట్రోల్ పోసి హత్య చేసిన తమ్ముడుకి జీవిత ఖైదు, రూ.45 వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ గాంధీనగర్‌కు చెందిన బుర్రా మోహన్‌బాబుతో అక్క కుమార్తె వేణుకు వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో విడిపోయి వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. భార్య వేణు వేరే ప్రాంతంలో ఉండడంలో ఆమెకు తన అక్క అండదండలు ఉన్నాయని మోహన్‌బాబు అనుమానించాడు. అక్క కోరుప్రోలు కుమారి ఉంటున్న కాకినాడ సూర్యనారాయణపురం ఇంటికి వెళ్లాడు. 2022 జనవరి 1వ తేదీన అక్క కుమారి ఇంట్లో వంట వండుతుండగా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో కుమారి శరీరం తీవ్రంగా కాలిపోయింది. వెంటనే ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మోహన్‌బాబుపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా, ఇంట్లోకి వెళ్లినందున పదేళ్ల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతి కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ప్రేమించానని మోసగించిన వ్యక్తిపై కేసు

జగ్గంపేట: ప్రేమించానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు జగ్గంపేట మండల గోవిందపురం గ్రామానికి చెందిన వెన్నముద్దల గాయత్రిని అదే గ్రామానికి చెందిన మరువాడ దుర్గాప్రసాద్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పెళ్లి చేసుకోమని అడుగుతుంటే ఏడాది నుంచి నిరాకరించడంతో మంగళవారం గాయత్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

సీతానగరం: మండలంలోని సింగవరం పంచాయతీ పరిధిలోగల నాగరత్నం కాలనీకి చెందిన గోలి గండి పోశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రవికుమార్‌తోపాటు పలువురిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. నాగరత్నం కాలనీకి చెందిన గండిపోశమ్మకు పురుషోత్తపట్నంకు చెందిన గోలి రవికుమార్‌తో వివాహం అయింది. అధిక వరకట్నం కావాలని మానసికంగాను, శారీరకంగాను భర్త రవికుమార్, అత్తమావలు, తోటి కోడలు, ఆడపడుచు, పెద్ద ఆడపడుచు భర్త వేధించినట్టు గండి పోశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో కురిడీ కొబ్బరి కాయల రాశి దగ్ధం


దగ్ధమవుతున్న కురిడీ కొబ్బరి కాయల రాశి

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కురిడీ కొబ్బరి కాయల రాశి అగ్నికి ఆహుతి అయ్యింది. ప్రమాదంలో అల్లు సురేష్‌కు చెందిన 2 లక్షల కురిడీ కొబ్బరి కాయలు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రాజోలు అగ్ని మాపక కేంద్ర అధికారి సీహెచ్ అనిల్ కుమార్, తమ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

బెండపూడిలో డయేరియా

18 కేసుల నమోదు


రావికంపాడు పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించిన డెప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ సరిత

తొండంగి: మండలంలో కొద్ది రోజులుగా ప్రబలిన డయేరియా క్రమంగా తగ్గుముఖం పట్టగా బెండపూడిలో 18 మంది డయేరియా బారినపడి వైద్యం పొందుతున్నారు. వారం రోజుల్లో సుమారు 100 మంది వరకూ డయేరియా బారినపడి కాకినాడతోపాటు వివిధ ఆస్పత్రులో వైద్యం పొందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించారు. కాగా కాకినాడ జీజీహెచ్ ఇతర ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారంతా క్రమంగా కోలుకుంటున్నారు. మంగళవారం కాకినాడ జీజీహెచ్ నుంచి 24 మంది డిశ్చార్జ్ అయ్యారని ఏ.వి.నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. బెండపూడిలో ఎస్సీపేటకు చెందిన పలువురు డయేరియా బారినపడటంతో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి రావికంపాడు పీహెచ్‌సీలో వైద్యం అందిస్తున్నారు. డెప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత, పీహెచ్‌సీ వైద్యాధికారి అర్చన బెండపూడి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా వైద్యారోగ్యశాఖ సిబ్బంది పర్యటించి రోగుల ఆరోగ్య పరిస్థితిపై సమగ్రమైన నివేదిక అందించాలని ఆదేశించారు. గ్రామంలో తాగునీరు, పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సుమారు 20 కేసుల వరకూ గుర్తించామని. కేసులు పెరగకుండా బెండపూడి గ్రామంలో చర్యలు చేపట్టామని డీప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సరిత వివరించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు


అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ హాకీ పోటీలో పాల్గొనే జిల్లా పురుషుల జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అనంతపురం జిల్లా ధర్మవరంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి పురుషుల హాకీ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును హాకీ కోచ్ రవిరాజు మంగళవారం ప్రకటించారు. సీనియర్స్ విభాగంలో జరిగే ఈ పోటీలలో జిల్లా నుంచి ఎం.అజయ్‌కుమార్, గణేష్, చరణ్‌కుమార్, నందు, మహేష్, విజయ్ కృష్ణ, ప్రవీణ్, సతీష్‌కుమార్, రాహుల్ ప్రణయ్, సురేంద్ర, మణికుమార్, జాన్‌పాల్, శివగోపాల్, శివకుమార్, నగేష్, జి.రాజు పాల్గొంటున్నారని తెలిపారు. జట్టుకు కోచ్‌గా సీనియర్ క్రీడాకారుడు బాబ్జి వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర కుమార్, సభ్యులు వి.గంగాధర్, ఎన్.వీరబాబు, అవినాష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.